క్లుప్తంగా

నేటి నుంచి పైడితల్లి పండగ



బాడంగి: మండలంలోని వాడాడ గ్రామదేవత పైడితల్లి పండగ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు సర్పంచ్ పూడి తిరుపతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి సునీత, గ్రామపెద్దలు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆదివారం మరిడిమాంబ పండగతో ప్రారంభమైన ఈ పండగ మూడు రోజుల పాటు జరుగుతుందని, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పండగ ఏర్పాట్లు పూర్తి చేయగా, ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీస్

రేగిడి: మండంలోని ఉంగరాడమెట్ట, బూరాడ, సంకిలి తదితర ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాలు, అక్రమంగా ఇసుక రవాణా కాకుండా నిఘా ఉంచామని ఎస్‌ఐ పి.నీలావతి తెలిపారు. వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పరిమితికి మించి లోడుతో ప్రయాణించకూడదని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మండలంలోని కింతలివానిపేటలో కొత్తగా నిర్మించిన శివాలయాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. కోనేరు మధ్యలో ఆహ్లాదకర వాతావరణంలో పూజలు చేసుకునేందుకు అనువుగా ఆలయ నిర్మాణం చేపట్టారని గ్రామస్తులను అభినందించారు. ఆ పరమేశ్వరుని కృపాకటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలని వేడుకున్నారు. అంతకుముందు ఆలయంలో శివలింగం ప్రతిష్ఠించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దామోదర్, సర్పంచ్ ప్రతినిధి బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



తల్లుల కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో మాతృ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణిల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కేంద్రానికి ప్రీస్కూల్ పిల్లల తల్లులను రప్పించి పిల్లలందరితో వారి తల్లుల కాళ్లు మొక్కించి ఆశీర్వాదం తీయించుకునేలా చేశారు. అనంతరం మాతృ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. పిల్లలంతా తల్లిదండ్రులను ఎప్పుడూ గౌరవించాలని అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తెలిపారు.

మోక్షప్రదాయిని భగవద్గీత



భక్తులకు భగవద్గీత గొప్పదనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: భగవద్గీత..మోక్షప్రదాయిని అని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గ్రామ గీతా మందిరంలో ఆదివారం జరిగిన దివ్యజీవన సత్సంగ సమావేశానికి ఆయన హాజరయ్యారు. భగవద్గీత చదివితే చెడుగీతలు చెరిగిపోతాయని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ బిజీ జీవితంలో పడిపోయి దైవాన్ని మర్చిపోతున్నారని, రోజులో ఎంతో కొంత సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని, మనశ్శాంతి లభ్యమవుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



- జనసంచారం లేక వ్యాపారం వెలవెల
- దిగాలుగా వ్యాపారులు
- వడ్డీ లేని రుణంతో ఆదుకున్న గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వమూ ఆదుకోవాలని విజ్ఞప్తి



రామభద్రపురంలో కొనుగోలుదారులు కోసం ఆశగా చూస్తున్న చిరువ్యాపారులు

చిరువ్యాపారులకు ఎండదెబ్బ

రామభద్రపురం: సాధారణంగా రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా బద్దలవుతాయి అంటారు..పెద్దలు. ప్రస్తుతం కార్తె రాకుండానే రోళ్లు బద్దలయ్యేలా ఎండలు కాస్తున్నాయి. నిత్యం 40 నుంచి 42 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు బయట అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్లకే పరిమితమైపోతున్నారు.

ఈ క్రమంలో తమ వ్యాపారాలు బాగా మందగించాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రామభద్రపురం అంతరరాష్ట్ర కూడలిలో పలు గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులు సీజనల్‌గా దొరికే పలు రకాల పండ్లు, కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆగిన బస్సుల వద్ద శనగకాయలు, పండ్లు, మొక్కజొన్న పొత్తులు, పూలు అమ్ముతుంటారు. అయితే ఇప్పుడు ఎండలకు జనసంచారం అంతగా లేకపోవడంతో వ్యాపారం పూర్తిగా తగ్గింది. తెచ్చుకున్న సరుకు అమ్ముడవ్వక.. మరోవైపు ఎండలకు పండ్లు పాడవుతున్నాయని దీంతో నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మండుటెండలో బస్సు వద్ద చిరువ్యాపారుల పాట్లు

గతంలో రూ.10 వేలు..

కష్టాన్నే నమ్ముకుని ప్రతిరోజూ రోడ్లు పక్కన, రోడ్ల వెంబడి తిరుగుతూ వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులను గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం ద్వారా సున్నా వడ్డీకే రుణాలు అందించి ఆదుకున్నారు. 12 నెలల్లో రుణాలను తిరిగి చెల్లించుకునే సదుపాయం కల్పించారు. రుణం ద్వారా సరుకు(పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు) కొనుగోలు చేసి, అమ్ముకున్న తర్వాత వచ్చే లాభంలో కొంత రుణంగా చెల్లించుకునే వాళ్లు. ఇప్పుడు ఆ రుణ సదుపాయం లేక.. మరోవైపు వ్యాపారం లేక చిరువ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో మాదిరి తమను ఆదుకునేందుకు ప్రయత్నం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గతంలో జగనన్న ఆదుకున్నారు..

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు రుణాన్ని సున్నా వడ్డీకే ఇచ్చి ఆదుకున్నారు. ఎండ ధాటికి కొనుగోలుదారులు రాక పండ్లు, కూరగాయలు చెల్లక పాడైపోతున్నాయి. వ్యాపారం కోసం తెచ్చిన అప్పులు తీరే మార్గం లేక సతమతమవుతున్నాం. ఈ సమయంలో వడ్డీ లేని రుణం ఇస్తే బాగుణ్ను.

–లక్ష్మి, చిరువ్యాపారి, రామభద్రపురం

ప్రభుత్వమే ఆదుకోవాలి..

ఎండలు.. తమకు కష్టాలు తెచ్చిపెట్టాయి. మూడు రోజులుగా ఎండ తీవ్రతకు సరిగా కొనుగోలుదారులు రాక పండ్లు చెల్లడం లేదు. వారం రోజుల క్రితం వరకు రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు లాభం వచ్చేది. ఇప్పుడు కొనుగోలుదారులు లేక ఉదయం, సాయంత్రం వేళల్లో విక్రయిస్తే రోజుకు రూ.300 రావడం కష్టంగా ఉంది. అరకొరగా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నాం.

– జి.కామేశ్వరరావు, తోపుదుబంధ్ల వ్యాపారి

జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: విద్యార్థినులంతా చదువులో బాగా రాణించి, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ యడ్ల నీరజారాణి ఆకాంక్షించారు. మండల పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యడ్ల నీరజారాణి గరల్స్ ఎస్ఎస్‌సీ–2025 అవార్డులకు సంబంధించి, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 540 మార్కులు పైబడి సాధించిన విద్యార్థినులకు ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఈ పరీక్ష ఏర్పాటు చేశామన్నారు. ఓటమితోనే గెలుపుబాటలు తెరుస్తాయని, ఓటమిని సానుకూలంగా తీసుకుంటేనే భవిష్యత్తులో రాణించగలమన్నారు. ఈ పరీక్షకు రాజాం నియోజకవర్గంతో పాటు తెర్లాం, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం, బూర్జ మండలాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 133 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సంతకవిటి మండలం, బొద్దూరు విద్యార్థిని గొర్లె నేహ, గుళ్లసీతారాంపురం విద్యార్థిని పల్ల మాధవి, మామిడిపల్లి విద్యార్థిని లావేటి భాషిణిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుని, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు, మెమెంటోలు సొంతం చేసుకున్నారు. తర్వాత 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యడ్ల గోపాలం, డాక్టర్ సామంతుల శరత్, పీఎంసీ చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్లు మరమ్మతులు

వంగర: మండలంలోని కోనంగిపాడు గ్రామంలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు ఆదివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. సర్పంచ్ చందక తాతబాబు ఆధ్వర్యంలో మెకానిక్ కృపారావు బోర్లు బాగు చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. బోర్లు బాగు చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సైనికులకు సత్కారం



బొబ్బిలి: దేశ రక్షణలో సైనికుల సేవలను ప్రశంసిస్తూ మండల కేంద్రంలో ముస్లింలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతపట్టుకుని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కోటలోని మాజీ సైనికుల కార్యాలయం వద్ద మాజీ సైనికులను సన్మానించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



మందరాడలోని ప్రధాన కూడలిలో ఓ చోట సీసీ కెమెరా అమర్చుతున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామ ప్రధాన కూడలిలో ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దోపిడీ దొంగతనాల నుంచి రక్షణగా ఇక్కడి షాపుల యజమానుల సాయంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే షాపుల్లో చోరీలు జరగవన్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఏ దొంగతనం జరిగినా నిందితులను పట్టుకోవడం సులభతరమవుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి: స్థానిక కోర్టు ఆవరణలో బొబ్బిలి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎం.ఆనంద్ కుమార్, ఆర్‌వీఎస్ఎస్ ప్రసాద్‌లు ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా బీఎస్ఆర్ మూర్తి, స్పోర్ట్స్, కల్చరల్ వింగ్ సభ్యుడిగా ఎస్‌జే విల్సన్‌బాబా, సంయుక్త కార్యదర్శిగా జి.స్వామినాయుడు, కోశాధికారిగా పి.మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రామారావు, బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

కాగాం వీఆర్‌ఏ మృతి

తెర్లాం: మండలంలోని కాగాం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ(విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్) గర్బాపు ఆనందరావు ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు జి.హేమంత్‌కుమార్..వీఆర్‌ఏ ఇంటికి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తినాయుడు, వీఆర్‌వోలను పంపించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేసి, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతదేహానికి ఆర్‌ఐ, వీఆర్‌వోలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



కళిశెట్టి సురేష్

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన కళిశెట్టి సురేష్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సురేష్.. ఇప్పటివరకు ఇంటికి రాలేదని, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినాబంధువులను వాకబు చేసినా ఫలితం లేదని తండ్రి ధనంజయ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమీకృత పశుదాణాతో అధిక పాల దిగుబడి



పశుదాణా పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారిణి స్రవంతి

రామభద్రపురం: సమీకృత పశుదాణాతో అధిక పాల దిగుబడి సాధ్యమవుతుందని పశు వైద్యాధికారిణి స్రవంతి తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో పాడిరైతులకు సబ్సిడీపై సమీకృత పశుదాణా ఆదివారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ దాణాలో 20 శాతం ప్రోటీన్లు కలిగిన మిల్లెట్స్ ఉంటాయని ఇది పచ్చగడ్డి మాదిరి పశువుల ఆరోగ్యం కాపాడడానికి ఉపయోగపడుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ.1110 ఖరీదైన 50 కేజీల బస్తాను 50 శాతం రాయితీపై రూ.555లకే ఈ పశుదాణా సరఫరా చేయడం జరుగుతోందన్నారు. దాణా కావాల్సిన రైతులంతా భారత్ పశుధన్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన పాడిరైతులకు మాత్రమే అందజేయడం జరుగుతుందని, కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు అప్పలనాయుడు, అనూష, ఆదినారాయణ, పవన్ కుమార్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు..నేలతల్లి బాగు!



నవధాన్యాల సాగు చేయడం ద్వారా నేలతల్లి బాగుంటుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అన్నారు. రేగిడి మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. తోటకూర, గోంగూర, చిక్కుడు, జొన్న, సజ్జ, రాగి తదితర విత్తనాలను పంటల్లో వేయాలని, ఒకే దఫా రెండు నుంచి మూడు రకాల పంటలు దిగుబడి వస్తాయని తెలిపారు. నవధాన్యాల సాగు ద్వారా నేలసారవంతమవుతుందన్నారు. సూక్ష్మజీవులు వృద్ధి చెంది, నేల గుల్లబారుతుందని తద్వారా పంటకు అవసరమైన పోషకాలు లభిస్తాయన్నారు. అంతర పంటగా నవధాన్యాలు సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. – రేగిడి

ముక్కు మూసుకోవాల్సిందే..



బాడంగిలో ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం కనిపిస్తోంది. మండల కేంద్రంలో ఎక్కడా ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద కేంద్రం) లేకపోవడంతో గ్రీన్‌అంబాసిడర్లు ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను శివారు ప్రాంతంలోని రోడ్డు పక్కన పారబోస్తున్నారు. అక్కడే కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) కూడా ఉండడంతో విద్యార్థుల ఆరోగ్యానికి ఇది మంచిది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే అటువైపుగా వెళ్లే వారంతా అక్కడి చెత్తకుప్పల నుంచి దుర్గంధం వెదజల్లుతోందని, అక్కడి వెళ్లగానే ముక్కు మూసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలకు ఆవాసంగా ఉండి డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే ఎస్‌డబ్ల్యూపీసీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – బాడంగి

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి



కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా లేబర్ కోడ్‌లు రద్దు డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై బొబ్బిలిలోని తాపీమేస్త్రీల సంఘ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్మిక హక్కులు హరించేలా కేంద్రం కొత్తగా లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, వాటిని వ్యతిరేకించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమ్మె రోజున ఉదయం 9 గంటలకు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద తమ నిరసన ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. కార్మికులంతా సమ్మెలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ కలాశీ సంఘ కార్యదర్శి ఎం.అప్పారావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి



రామభద్రపురం గ్రంథాలయంలో పిల్లలతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవేణి



తెర్లాం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు



బాడంగి గ్రంథాలయంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్

విజ్ఞానం.. వినోదం!

గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు..విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచుతున్నాయి. ఆటపాటలతో కూడిన విద్యనందిస్తుండడంతో పిల్లలు కూడా గ్రంథాలయాల బాటపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతిరోజూ ఓ పూట జ్ఞానం అందించే పుస్తకపఠనం, క్విజ్ పోటీలు చేపడితే రెండోపూట.. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలిగించే ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వివిధ రంగాల్లో నిపుణులైన వారితో తరగతులు ఇప్పిస్తున్నారు.

– రామభద్రపురం, తెర్లాం, బాడంగి



రేగిడి: తమ గురువులతో దేవుదల పాఠశాల పూర్వ విద్యార్థులు



రాజాం సిటీ: గురువులను సన్మానిస్తున్న బొద్దాం పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



బొబ్బిలిరూరల్: తాము చదువుకున్న పాఠశాలకు బహుమతిగా లౌడ్‌స్పీకరు అందిస్తున్న ఏసియన్ బ్లైండ్ స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాజాం మండలం, బొద్దాం..రేగిడి మండలం, దేవుదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సహా బొబ్బిలి మండలం, మెట్టవలస ఏసియన్ అంధుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం తమ గురువులను సన్మానించి, తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కార్యాచరణ ప్రకటించారు.

–రాజాంసిటీ, రేగిడి, బొబ్బిలి